జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
గురువారం | 29 | మే | 2025 ◆ పేజీలు : 7

ఆలయ అభివృద్ధి పనులు
# సకాలంలో పూర్తి చేయాలి

## డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు



- ఆలయ అభివృద్ధి కోసం 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలు మంజూరు
- స్వామి ఆశీస్సులతో ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు
- ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో శ్రీ యోగా నంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సి.ఎం

2 లో...





మహిళా సంఘాల ఉత్పత్తులకు...
# ప్రణాళిక బద్ధంగా డిమాండ్ సృష్టించాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- జన సంచారం ఉన్న ప్రదేశాలలో మహిళా సంఘాల ఉత్పత్తులను ప్రదర్శించాలి
- నగరంలోని 4 మార్కెట్లలో కూడా మహిళా సంఘాలకు ప్రత్యేక సెంటర్ల ఏర్పాటు
- ఖమ్మం మహిళా మార్ట్ ను ప్రారంభించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రణాళిక బద్ధంగా డిమాండ్ సృష్టించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగే శ్వరరావు అన్నారు.బుధవారం మంత్రి, ఖమ్మం నగరంలో 30 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఖమ్మం మహిళా మార్ట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళా సంఘాలు తయారు చేసిన పరికరాలు, వస్తువుల విక్రయం కూడా వారి ద్వారానే జరగాలని పట్టుదలతో జిల్లా కలెక్టర్, మహిళా మార్ట్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. దళారులకు లాభం వెళ్లకుండా మహిళా సంఘాలు లాభ పడాలనే ఆకాంక్షతో ప్రభుత్వం మహిళా మార్ట్ ఏర్పాటు చేసిందని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మహిళా సంఘాలు తయారు చేసే వస్తువులను విక్రయించేందుకు హైదరా బాదులోని శిల్ప కళారామం వేదికలో అవకాశం కల్పించారని తెలిపారు. అదే విధంగా ఖమ్మం నగరంలో ప్రయోగాత్మకంగా ఖమ్మం మార్ట్ ఏర్పాటు చేసామని తెలిపారు.ఖమ్మం నగరంలో నాలుగు వైపులా ఉన్న నాలుగు మార్కెట్లలో కూడా మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా మార్ట్ లాంటి సౌకర్యాలను కల్పించాలని అన్నారు. ముదిగొండ మహిళలు బ్యాగులు తయారు చేశారని, బ్రాండెడ్ షాపుల కంటే చాలా బాగా ఉన్నాయని అన్నారు.మనం తయారు చేసిన వస్తువుకు వ్యాపారం జరగాలంటే అన్ని చోట్ల ప్రదర్శనలు చేయాలని మంత్రి సూచించారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ వంటి జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా చిన్న, చిన్న స్టాల్స్ వంటివి ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులు మన ప్రజలు వాడుకునేలా తయారు కావాలని అన్నారు. మన వస్తువులు పక్క దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని మంత్రి తెలిపారు.మన పిల్లలు బాగా చదువుకుంటేనే పేదరికం నుంచి

మిగతా 2 లో...

రైతులు ఆయిల్ పామ్ వంటి
# లాభసాటి పంటలను సాగు చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఆయిల్ పామ్ పంట లాభాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
- పంటల మార్పిడి విధానంతో అకాల వర్షాల నష్టాలను తగ్గించవచ్చు
- రైతులకు సాగు లాభాలు పెంచడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలి
- బల్లేపల్లి లో పర్యటించి ఆయిల్ పామ్ పంటలను రైతులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి :** స్థానిక పంట మార్పిడి విధానంతో

మిగతా 2 లో...

# తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక స్వర్గీయ ఎన్టీఆర్

- మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు




**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక తెలుగు ప్రజల ఆరాధ్య నటుడు, దివంగత సీఎం, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డా. నందమూరి తారక రామారావు జయంతిని పుర స్కరించుకుని ఆయనను స్మరించుకుం టూ బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగే శ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ వ్యక్తిత్వం, ఆయన సినీ, రాజకీయ జీవితంలో సాధించిన ఘనతలు నేటికీ ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నాయని నామ తెలిపారు. తెలుగు చలనచిత్రరంగానికి ఎన్టీఆర్ అందించిన విశిష్ట సేవలు, రాష్ట్ర ప్రజల కోసం ఆయన చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజకీయ నాయ కుడిగా ఎన్టీఆర్ ఎన్నో సవాళ్లు ఎదుర్కోవటంతో పాటు, ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టారన్నారు. తన నాయకత్వంలో ఎన్నో సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల జీవితాల్లో

మిగతా 2 లో...

## ఆలయ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు, ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో శ్రీ యోగా నంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రజలు ఆరాధ్య దైవంగా శ్రీ యోగా నంద లక్ష్మీ నరసింహ స్వామిని కొలుస్తున్నారని తెలిపారు. దేవాలయంలో ఉన్న ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని దేవాలయంలో నిత్య పూజ నిమిత్తం ఉంచి కళ్యాణ సమయంలో తీసుకొని వచ్చేవారని డిప్యూటీ సీఎం తెలిపారు. శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆశీర్వాదంతో తన ఎన్నికల ప్రచారం ప్రారంభమయిందని, ఆ స్వామి వారి ఆశీస్సులతో నేడు ఆలయ అభివృద్ధికి 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలను ప్రభుత్వంచే మంజూరు చేయించడం జరిగిందని అన్నారు.దేవాలయంకు కేటాయించిన అభివృద్ధి నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని, ఆలయ పునర్నిర్మాణం పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి కావాలని, స్వామి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని ప్రార్థిస్తూ యాగం నిర్వహించామని అన్నారు.వాతావరణ శాఖ సూచనల ప్రకారం వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలుపగా అధికారులు కొంత ఆందోళన చెందినప్పటికీ, దేవుని కార్యక్రమానికి ఆటంకాలు ఆ స్వామి తొలగిస్తారని భావించామని, అదే విధంగా నేడు వర్షం లేదని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భగవంతుని ఆశీర్వాదంతో ఋతుపవనాలు ముందస్తుగా వచ్చాయని తెలిపారు. ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా, రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్లు, ఇందిరా మహిళా శక్తి క్రింద మహిళలకు వడ్డి లేని రుణాలు, 22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 12 వేల 500 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాలు చేపట్టామని అన్నారు.రైతులకు 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా 12 వేల రూపాయలు పెంచి అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద కూలీలకు 12 వేల రూపాయలు అందిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ఉత్పత్తులకు...

# ప్రణాళిక బద్ధంగా డిమాండ్ సృష్టించాలి





(మొదటి పేజీ తరువాయి...)

బయటకు వస్తామని, పిల్లలను లింగ బేదం లేకుండా ఉన్నత చదువులు చదివించాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలను ప్రత్యేకంగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఇందులో భాగంగా మన ఖమ్మం జిల్లాలో ప్రత్యేకంగా టీ స్టాల్, షీ రాక్స్ సెంటర్, మహిళలకు లాభం కలిగేలా అనేక కార్యక్రమాలను ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.6 నెలల క్రితం మంత్రి ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా మహిళా మార్ట్ ఏర్పాటు చేశామని అన్నారు. మహిళలకు ఉత్పత్తులు తయారు చేయడంతో పాటు వాటి ప్యాకింగ్, మార్కెటింగ్ ఎలా చేయాలి, దళారులు లేకుండా లాభం పూర్తి స్థాయిలో మహిళలకు అందాలని మార్ట్ ఏర్పాటు చేశామని అన్నారు. మహిళా సంఘాల్లోని మహిళలకు మార్ట్ నిర్వహణపై శిక్షణ కూడా అందించామని అన్నారు. ఖమ్మం నుంచి వచ్చే ఫలితాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన మున్సిపాలిటీలలో కూడా ఇటువంటి మార్ట్ ఏర్పాటుకు భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని అన్నారు.జిల్లాలో మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే 20 రకాల వస్తువులు మన జిల్లా బ్రాండింగ్ తో ఏర్పాటు చేశామని అన్నారు. మన జిల్లా వాసుల కోసం మన మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు ఖమ్మం మహిళా మార్ట్ లో ఎటువంటి కల్తీ లేకుండా పూర్తి నాణ్యతతో కూడిన పదార్థాలు అందుబాటులో ఉంటా యని అన్నారు. మహిళా మార్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన టీ స్టాల్ ను మంత్రి ప్రారంభించి, టీ త్రాగారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకాష్ నగర్ 29వ డివిజన్ లో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి నిధులు 60 లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు నాణ్యతతో పది కాలాల పాటు ఉండేలా పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పూనుకొల్లు నీరజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ చైర్మన్, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య, ఆర్డీఓ నరసింహా రావు, పంచాయతీ రాజ్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కార్పొరేటర్లు, మహిళలు, పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక స్వర్గీయ ఎన్టీఆర్

(మొదటి పేజీ తరువాయి...)

వెలుగులు నింపారని గుర్తు చేశారు. పటేల్ పట్వారీ విధానం రద్దు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తదితర కార్యక్రమాలు పేదల అభిమానాన్ని చూరగొనడమే కాకుండా వారికి ఆర్థికంగా, సామాజికంగా ఎంతో భరోసానిచ్చాయన్నారు.రూ.2 కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పేద వారికి గృహ నిర్మాణాలు సహ మధ్యాహ్న భోజన పథకాల ద్వారా సామాజిక న్యాయం అందించారని వివరించారు. ఎన్టీఆర్ సేవలను గుర్తించి ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ 17వ లోక్ సభలో తాను ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు నామ తెలిపారు. "ఎన్టీఆర్ కు భారతరత్న లభిస్తే అది కేవలం ఒక వ్యక్తికి కాదు — ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ఇచ్చిన గుర్తింపు అవుతుంది" అని నామ అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ పట్ల తనకున్న గౌరవం, అభిమానంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక మండలాల్లో ఎన్టీఆర్, నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. అలాగే ఎన్టీఆర్ భార్య బసవతారకం జ్ఞాపకార్థంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ స్థాపించి పేదలకు అందుబాటులో ఉండే విధంగా అధునాతన క్యాన్సర్ వైద్యం అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పదిహేనవ లోక్ సభ పార్లమెంట్ లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం కోసం చేసిన పోరాటం ఫలితంగా అది సాకారమైనదని నామ అన్నారు.

## రైతులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటలను సాగు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

అకాల వర్షాల నష్టాలను తగ్గించవచ్చని, అనుకోకుండా వచ్చే వానాల వల్ల ఇబ్బందులు లేని ఆయిల్ పామ్ వంటి లాభాసాటి పంటను రైతులు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం అర్బన్, రఘునాధపాలెం మండలాల్లో పర్యటించారు. బల్లేపల్లి లోని కుర్ర మహేష్ రైతుకు చెందిన పామాయిల్ పంటను స్థానిక రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పామాయిల్ పంట సాగు చేయాలనే ఆలోచన మొదట ఎలా వచ్చింది, పంట సాగు కు ఏలాంటి జాగ్రత్తలు చర్యలు పాటించారు. ఈ పంటల పైన సంతప్తిగా ఉందా, మంచి దిగుబడి వచ్చిందా, ఇక్కడికి వచ్చిన ఇతర రైతులకు పామాయిల్ పంట వేసుకోవాలని ప్రోత్సహిస్తావా అంటూ మహేష్ తో కలెక్టర్ సంభాషించారు. ఐదు ఎకరాలు పామాయిల్ పంట వేశాను అన్ని 4వ సంవత్సరంలో ఎకరానికి నాలుగు టన్నుల చొప్పున పంట దిగుబడి వచ్చిందని,



గిట్టుబాటు ధర మంచిగా ఉందని, తక్కువ నీరు, తక్కువ కూలీలతో పామాయిల్ మంచిగా ఉంటుందని మహేష్ రైతు వివరించారు. ఆయిల్ పామ్ తోటను రైతులతో కలిసి తిరుగుతూ అంతర పంటలు, ఇతర సమస్యలపై పంట పొలం గట్టు వద్ద రైతులతో కూర్చొని జిల్లా కలెక్టర్ ముచ్చటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో లాభదాయక ఆయిల్ పామ్ పంటను అధిక సంఖ్యలో రైతులు సాగు చేయాలని, ఆ దిశగా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు వల్ల చాలా లాభాలు ఉంటాయని, అంతర్ పంటల ద్వారా మొదటి 3 సంవత్సరాలు ఆదాయం వస్తుందని, ఆయిల్ పామ్ పంట దిగుబడి ప్రారంభమైన తర్వాత సంవత్సరానికి లక్షకు తగ్గకుండా రైతులు ఆదాయం సంపాదిస్తారని అన్నారు.ఆయిల్ పామ్ పంట వేసేందుకు ప్రభుత్వం మొక్కల సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయ కల్పనకు సబ్సిడీ, మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర్ పంట పెట్టుబడులకు కొంత సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులు బాగు పడతారని, 4 సంవత్సరాల నుంచి ఆయిల్ పామ్ పంట వల్ల ఆదాయం రావడం ప్రారంభమవుతుందని, 7వ సంవత్సరం నుంచి పూర్తిస్థాయి పంట వస్తుందని, రైతులకు అద్భుతంగా ఆదాయం లభిస్తుందని, పరిసరాలలోని ఇతర రైతులు కూడా ఆయిల్ పామ్ పంట సాగు చేసేలా అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు.గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ద్వారా ఆయిల్ పామ్ పంట వంద ఎకరాలలో క్లస్టర్ ఉంటే రైతులకు లాభం అయ్యే విధంగా రైతుల వద్ద కొనుగోలు చర్యలు చేపడతామని అన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా వేసిన పంట వలన రైతులు నష్టపోతున్నారని, రైతులు ఏ పంట పండించాలనే అంశంపై విస్తృతంగా చర్చ పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులు అవగాహన కల్గి ఉండాలని, పంటల మార్పిడి పై అవసరమైన సహాయ, సహకారాలు, జిల్లా అధికారులు అందిస్తారని కలెక్టర్ భరోసా ఇచ్చారు. నూతన సాగు పద్ధతులు మొదటి పెద్ద రైతుల ద్వారా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, హెచ్వో నగేష్, రఘునాధపాలెం ఎవో కిషోర్ బాబు, ఆగ్రో వెట్ లిమిటెడ్ మేనేజర్ ఏ. రామకృష్ణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శిరవేగంగా పూర్తి చేయాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు.
- లబ్ధిదారులకు పట్టాల పంపిణీ




**నెలకొండపల్లి, మే 28 ప్రజా జ్యోతి :** నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం రైతు వేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు మాట్లాడుతు ..ఈ సం దర్భంగా నేలకొండ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు మాట్లాడుతూ, “ఇంది రమ్మ ఇల్లు లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమర్థవంతంగా చర్యలు తీసుకున్నా రు. మా మండలానికి అదనంగా ఇళ్ల మంజూరులో రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారం విలువైనది. ఆయనకు మండల ప్రజల తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాం,” అని తెలిపారు. అలాగే, “ఇందిరమ్మ ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలుగా మద్దతు లభిస్తోంది. రైతులందరికీ త్వరలోనే బోనస్ అందుతుంది. ప్రభుత్వం వారిని అన్నివిధాలా రక్షిస్తూ ముందుకు తీసుకెళ్తోంది,” అని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల కలను నిజం చేస్తూ ఇందిరమ్మ ప్రభుత్వ పథకం ముందు కు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, మాజీ సర్పంచ్ లు పెంటమళ్ల పుల్లమ్మ, కొమ్మినేని విజయ్ బాబు, వడ్లమూడి నరసయ్య, అధికారులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజును సత్కరించిన సిరిపురపు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను ఖమ్మం నగరానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సిరిపురపు సుదర్శనరావు శాలువాతో సత్కరించారు. సుదర్శనరావు మనుమరాలు మోక్షశాన్విశ్రీ అన్నప్రాసన వేడుక ఈనెల 26వతేదీన ఖమ్మంలో జరిగింది. ఎంపీ రవిచంద్ర హైదరాబాద్ లో వివిధ పనుల వల్ల తీరిక లేకుండా ఉన్న కారణంగా ఈ వేడుకకు హాజరు కాలేనందున బుధవారం ఉదయం ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సుదర్శన రావు నివాసానికి విచ్చేసి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన రావు ఎంపీ వద్దిరాజును సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు.

## పేదల సమస్యలపై 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- ఆందోళనకు సమాయత్తమవుతున్న వ్యవసాయ కూలీలు
- వేలాదిగా తరలించేందుకు విస్తృత ప్రచారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రామిరెడ్డి



**నేలకొండపల్లి, మే 28 ప్రజా జ్యోతి :** పేదలు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.వి.రామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బోదులబడ గ్రామంలో డంపింగ్ యార్డ్ వద్ద పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా కమ్యూనిస్టు పార్టీల సహకారంతో కేంద్రంలోని గత యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. వ్యవసాయ కూలీలకు పని దినాలు తగ్గించడంతోపాటు రోజు వారి కూలీని కూడా నామమాత్రంగా ఇస్తుండడంతో వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి కూలీలకు పని భద్రత భరోసాగా ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూమిలేని నిరుపేదలందరికీ 12 వేల ఆర్థిక సహాయం, పెంచిన నాలుగువేల పింఛను అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు రోజు కూలి 600 రూపాయలు చెల్లించాలని, పని ప్రదే శంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో వేలాదిమంది పేదలు, వ్యవసాయ కూలీలు పాల్గొనేలా గత అనేక రోజులుగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాదిమంది పేదలు, వ్యవసాయ కూలీలను ధర్నాకు తరలించి పాలక ప్రభుత్వాల మెడలు వంచి రానున్న కాలంలో సమస్యలు సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్లు గడ్డం భాగ్యలక్ష్మి, కుమారి, ఎడవల్లి సైదమ్మ, శ్రీను, యశోద, వెంకటలక్ష్మి, పొట్ట పెంజర వాణి, మరియమ్మ, యేసు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల ను తీరుస్తున్న తుమ్మల యుగంధర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక తుమ్మల క్యాంప్ కార్యాలయంలో ప్రజల సమస్యల అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగేందర్. తండ్రికి తగ్గ తనయుడు తండ్రి అడుగుజాడల్లో అనునిత్యం ప్రజల శ్రేయస్సు కోరే ప్రజా నాయకుడు గా గుర్తింపు పొంది. ప్రజా శ్రేయస్ కోసం ప్రజల అవసరాల కోసం ప్రజలతో మమేకమై అన్ని డివిజన్ ప్రజల అవసరాలను తీర్చుకుంటూ వస్తున్న యువ నాయకుడు నాయకుడు తుమ్మల యుగంధర్. 52వ డివిజన్లో పెన్షన్లు, రాజీవ్ యువశక్తి ఇందిరమ్మ ఇండ్ల సమస్యల గురించి తుమ్మల యుగంధర్ కు వివరించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వాది మాల మహానాడు మూమెంట్ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రామారావు. ఆ విషయం పై తుమ్మల యుగంధర్ స్పందించి త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

## ఆడపిల్ల ప్రతి ఇంటి మణిదీపం



**నేలకొండపల్లి, మే 28 ప్రజా జ్యోతి :** బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తిరుమలయపాలెం ఐసిడిఎస్ ఎ సి డి పి ఓ రత్నకుమారి అన్నారు.. మాఇంటి మణిదీపం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా నేలకొండపల్లి మండలం లోని మోటపురం లో ఇటీవల ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు నాగలక్ష్మి–సురేష్ ఇంటికి అధికారులు వెళ్లి వారిని అభినందించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించి స్వీట్లు, పండ్లు అంద జేసి చిన్నారి ని ఆశీర్వదించారు. ఈసందర్భంగా ACDPO రత్నకుమారి మాట్లాడుతూ అమ్మాయిలు పుడితే భారం అని అనేక కుటుంబాలు భావిస్తున్నాయని మగపిల్లల తో సమానంగా ఆడపిల్లలను పెంచాలని ఆయన అన్నారు. ఆడపిల్లలు మగ వారితో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు పోతున్నారని ఆయన తెలిపారు. ఆడపిల్ల ఇంటికి లక్ష్మీదేవి అని వారిని సం రక్షించు కోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ఒక ఆడపిల్ల ఉండాలని వారిపై వివక్షను రూపుమాపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ లక్ష్మి కుమారి పాల్గొన్నారు.

## కొత్తూరులో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

**సత్తుపల్లి మే28(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వ్యవసాయ కళాశాల అశ్వరావుపేట వారి ఆధ్వర్యంలో రైతు వేదికలో, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్లగుల్ల కృష్ణయ్య, మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యా లయం రైతులతో శాస్త్రవేత్తలను మమేకం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టటం నిజంగా అభినందనీయం అన్నారు. ముందు ముందు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టి రైతులకు మేలు చేకూర్చేలా చేయాలని అన్నారు. అనంతరం వ్యవసాయ కళాశాల, అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులను, సమతుల్యంగా వాడాలి అన్నారు. యూరియాను మరియు ఇతర ఎరువులను తగిన మోతాదులో వాడటం వలన సాగు ఖర్చులు తగ్గించుకొని, అధిక నికర లాభాలు పొందవచ్చు అన్నారు. రైతులు పంట మార్పిడి చేయటం మరియు పంట అవశేషాలను భూమిలో కలియదండటం వలన భూసారం పెరుగుతుంది అన్నారు. రైతులు పంటల సాగులో పాటించవలసిన శాస్త్రీయ మెలకువలు గురించి తెలియజేశారు. అదేవిధంగా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ విత్తనాలు మరియు రసాయనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా రసీదులను భద్రపరచుకొని, ఏదైనా సమస్యలు వచ్చినట్టయితే వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే రైతులు నష్టపోకుండా ఉంటారు అని తెలియపరిచారు. సాగునీరు వినియోగంలో పాటించాల్సినటువంటి శాస్త్రీయ మెలకువలను రైతులకు వివరించారు. అనంతరం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాంప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్షలకు మట్టి నమూనాను ఏ విధంగా సేకరించాలి, ఏ పోషకాలను పంటలకు ఏం మోతాదులో ఏ విధంగా వాడాలి తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం యొక్క ఆవశ్యకతను రైతు లకు వివరించారు. పంట మార్పిడి వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. రమేష్ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో పాటించాల్సినటువంటి మెలకువలు, పంట అవశేషాలను భూమిలో కలియ పెట్టుకోవడం వల్ల కలిగేటువంటి ప్రయోజనాలను గురించి వివరించారు. తరువాత పశు సాహసంచాలకులు డాక్టర్ ప్రదీప్, మరియు పశు వైద్యులు డాక్టర్ శశిదీప్ మాట్లాడుతూ వ్యవసాయానికి పాడి పరిశ్రమకు విడదీయరాని అనుబంధం ఉంది. రైతాంగం వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను కూడా చేపట్టినట్లయితే అధిక లాభాలను పొందవచ్చు అన్నారు. వేసవికాలంలో పశు పోషన్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారులునరేష్ , ఆశాజ్యోతి, వాసంతి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు తో పాటు కొత్తూరు రైతులు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళల చే షీ రాక్స్ సెంటర్ల ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మహిళల ఆర్థిక ఉన్నతిని కాంక్షిస్తూ జిరాక్స్ సెంటర్ల కేటాయింపు
- రఘునాథ పాలెం తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో షీ రాక్స్ సెంటర్ ను ప్రారంభించిన కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళలచే షీ రాక్స్ సెంటర్ ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.బుధవారం రఘునాథపాలెం మండల తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకం లో మహిళల అర్థిక ఉన్నతిని కాంక్షిస్తూ గార్లపాటి రమాబాయి కి మంజూరైన షీ రాక్స్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ, దివ్యాంగులకు ఉపాధి కల్పించేలా షీరాక్స్ పేరిట ప్రభుత్వ కార్యాలయాల వద్ద కంప్యూటర్ తో కూడిన జిరాక్స్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని, ఇందులో భాగంగా రఘునాథ పాలెం మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద షీ రాక్స్ సెంటర్ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు.తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయాల వద్ద జిరాక్స్ షాపు కు మంచి డిమాండ్ ఉందని, దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉపాధి పొందే అవకాశం ఉందని అన్నారు. సిటిజన్ సర్వీస్ సెంటర్, స్కానింగ్, నామినేషన్ వంటి సౌకర్యాలతో భవిష్యత్తులో విస్తరణకు కూడా అవకాశం ఉంటుందని అన్నారు.సిటిజన్ సర్వీస్ సెంటర్, జిరాక్స్ షాపులను ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద దివ్యాంగులైన మహిళలకు ప్రతి మండల కేంద్రంలో తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ముందుగా దివ్యాంగులకు కేటాయించి జిరాక్స్ కేంద్రాలు ప్రారంభిస్తామని, అనంతరం దశల వారీగా మహిళలకు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో షీ రాక్స్ సెంటర్ లను కేటాయిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, రఘు నాథ పాలెం మండల తహసీల్దార్ శ్వేత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతిమ యాత్రలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర



**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** వైరా మాజి శాసనసభ్యులు బానోత్ మదన్ లాల్ అంత్యక్రియలు రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో నిర్వహించారు.మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారు మదన్ లాల్ పార్థివాదేహానికి బీఆర్ఎస్ పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు.మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పాడే మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, బానోత్ హరిప్రియ, రేగా కాంతారావు, మాజీ చైర్మన్లు నాయకులు పాల్గొన్నారు

## కూతురు పుట్టిన ఇల్లు కళకళలాడుతూ ఉంటుంది

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు వస్తేనే ఆడపిల్లలకు సమానత్వం
- పురుషులతో పోటీపడుతూ ప్రతి రంగంలో మహిళలు ముందంజలో నిలుస్తున్నారు
- నగరంలోని ద్వార కనగర్ లో ఆడపిల్ల జన్మించిన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి స్వీట్ బాక్స్ అందించి, భాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక సామాజికంగా తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు వస్తేనే అడపిల్లలకు సమానత్వం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.ఆడపిల్లలు పుట్టడం అదృష్టమని తెలుపుతూ, ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మా పాప – మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 51వ డివిజన్ ద్వారకనగర్ లో బేగం కుటుంబ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు అందంగా ఇంటిని ఆలంకరించి ఆడపిల్లలను పుట్టనిద్దాం.. ఆడపిల్లలను పెరగనిద్దాం.. అమ్మాయిలు ఐపీఎస్, ఐఎఎస్, పోలీస్, డాక్టర్, టీచర్, లాయర్, సైంటిస్ట్, పైలెట్ పలు రంగాల్లో ఉన్నతంగా రాణించాలనే నినాదాలతో ముగ్గులు వేసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఘన స్వాగతం పలికారు. షాజీదాబేగం– అఖీల్ దంపతులకు 12 ఫిబ్రవరి, 2025న ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసి, వారి ఇంటికి వచ్చిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాప తల్లిదండ్రులతో పాటు నాన్నమ్మ, పెద్దనాన్న, పెద్దమ్మ బంధువులను కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, నూతన దుస్తులు, సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలు వాలతో సన్మానించారు. చేతులతో పాపను ఎత్తుకొని రంగు రంగుల పూలతో ముస్తాబు చేసిన ఊయలలో వేసి పాప చిరునవ్వుకు కలెక్టర్ మురిసిపోయారు. సమాజానికి ఆడపిల్లల ఆవశ్యకత ఏలాంటిదో వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఆధికారులు ఈ కార్యక్రమంలో ఆడబిడ్డలను ఆశీర్వదించడం చూస్తుంటే సంతృప్తి కలుగుతుందని ఆనందం వెలిబుచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుంటున్నారని, ఆడపిల్లలను బాధ్యతగా పెంచి పోషించి బంగారు భవిష్యత్‌ను కల్పించాలని కోరారు. ఆడబిడ్డ పుట్టిన తల్లిదండ్రులు అదృష్టవంతులు అని అన్నారు. అమ్మాయిలను మగవారితో పమానంగా విద్య, వైద్యం, న్యాయం, సంరక్షణ, సామాజిక ఎదుగుదలకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ఆడపిల్లలే ఇంటికి మణి దీపాలు ప్రస్తుత ఆధునిక యుగంలో అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీపడుతూ దూసుకెళ్తున్న మహిళలు ఏ రంగంలో తక్కువ కాదు అని నిరూపిస్తున్నారని అన్నారు. కుటుంబ వ్యవస్థలో, సమాజం అత్యాధునిక అభివద్ధి పదంలో కొనసాగటానికి ప్రధాన భూమిక మహిళలదే అని, మహిళలను బాల్యం నుండే ప్రోత్సహించి దేశ అభ్యున్నతికి అందరూ కషి చేయాలని తెలియజేశారు.అమ్మాయిలు గొప్ప స్థానంలో ఎదిగేందుకు ఎవరికి తక్కువ కాకుండా పెంచాలని, మనం ఆశించే మార్పు మన ఇంటి నుండే ప్రారంభించాలని, ఆడబిడ్డ కుటుంబానికి అమ్మగా ఉంటుందని, అన్ని బంధాలకు మాతృ ప్రేమ పంచేవారని అన్నారు. సమాజంలో అమ్మాయి పుడితే మనకు అమ్మ పుట్టినట్లు భావించాలని కలెక్టర్ సూచించారు.మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి, మంచి సందేశం అందించాలని, మహాలక్ష్మి ఇంట్లో పుట్టినందుకు శుభాకాంక్షలు తెలిపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు.

ఆనతరం పాప తల్లిదండ్రులు మాట్లాడుతూ, మా ఇంటికి కలెక్టర్ వచ్చి మా పాపకు ఆశీస్సులు అందించి, పాప భవిష్యత్తు గురించి చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని, కలెక్టర్ చెప్పిన విధంగా మా పాపను మంచిగా చదివించి ఉన్నత స్థాయిలో ఉండే విధంగా తీర్చిదిదుతామని, పాప పెద్దయిన తర్వాత ఇంటికి కలెక్టర్ గారే స్వయంగా వచ్చి దీవించి వెళ్లారని తెలిపి ఈ నాటి మధు ర క్షణాలను పంచుకుంటామని తెలిపా రు.ఈ కార్యక్రమంలో సిడిపివో బి. వీరభద్రమ్మ, సూపర్వైజర్ విజయల క్ష్మి , ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచ ర్లు, సిబ్బంది, సంబంధిత అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- ప్రతిష్టాత్మక పథకాలను వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటు
- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక జిల్లాలో నిర్వహించు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై డిఆర్వో ఏ. పద్మశ్రీ తో కలిసి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటుకు సిద్ధం చేయాలని అన్నారు.గ్రామీణ అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసే స్టాల్ లో ఇందిరా డెయిరీ వివరాలను తెలియజేయాలని అన్నారు. సంక్షేమ శాఖ పరిధిలో ఏర్పాటు చేసే స్టాల్ లో ఇందిరా సౌర గిరి జల వికాసం, రాజీవ్ యువ వికాసం పథకాలను వివరించాలని అన్నారు.రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు మినెట్ టు మినెట్ కార్యక్రమ ప్రణాళిక ప్రకారం సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్ తెలిపారు.రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు.వేడుకల వద్ద వైద్య బృందాలచే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అవసరమైన మేర త్రాగు నీటి సరఫరా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.వేడుకలకు ఆహ్వాన పత్రికలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. ముఖ్య అతిథి గౌరవ వందనం, ఇతర బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందిగా చేయాలని అన్నారు.అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. రాష్ట్ర అవతరణ పోరాటాల సందేశం ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు జరగాలని అన్నారు. 25 నిమిషాలు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేలా చూడాలని అన్నారు.అవతరణ వేడుకలకు పబ్లిక్ అడ్రస్ సిస్టం అర్బన్ తహసిల్దార్ ఏర్పాటు చేయాలని అన్నారు. పాత్రికేయులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని అన్నారు.వానాకాలం దృష్టిలో ఉంచుకొని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డ్రైయిన్ లను క్లియరెన్స్ కోసం ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే క్లియర్ చేయాలని, ప్రజలకు ఫిర్యాదుల నమోదు కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ షఫీ ఉల్లాను అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అధికారులు, పోలీసు, కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మదన్ లాల్ మృదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు



**రఘునాధపాలెం ప్రజా జ్యోతి** రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు గౌరవ శ్రీ తుమ్మల నాగేశ్వరావు ముఖ్య నాయకులు. బానోత్ మదన్ మృతి చెందడం చాలా బాధాకరం వారి కుటుంబానికి తీరని లోటు. మంత్రి తుమ్మల తీవ్ర దిగ్రాతి వ్యక్తం చేశారు.మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ (63) మంగళవారం తెల్లవారు జామున మృతి చెం దారు. అనారోగ్యంతో బాధప డుతున్న ఆయనను కుటుంబీకులు హైదరాబాద్ ఐఏ జీ ఆసుపత్రిలో ఈనెల 23న చేర్పించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే గుండెపోటు రావడం తో కన్నుమూశారు. ఆయన స్వగ్రామం రఘునాథ పా లెం మండలం ఈర్లపుడి కాగా భార్య మంజుల, కుమా రుడు మృగేందర్లాల్, కూతురు మనీషాలక్ష్మి ఉన్నారు. కుమారుడు తమిళనాడు (కోయంబత్తూరు) జీఎస్టీ కమిషనర్ గా, కోడలు శ్వేత తమిళనాడు కేడర్ లో జాయింట్ కలెక్టర్ విధులు నిర్వర్తిస్తు న్నారు. మూడు నెలల క్రితమే ఆయన సోదరుడు, ఏసీపీ జవ హర్ లాల్ ప్రమాదంలో మృతి చెందాడు. ఇప్పు డు మదన్లాల్ మృతితో విషాదం నెలకొంది.

# రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత అవసరం

- నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలి
- వ్యవసాయ,పోలీస్ సంయుక్త శాఖల ఆధ్వర్యంలో అకస్మిక తనిఖీలు
- పాల్గొన్న ఎస్సై వెంకన్న,ఏఓ వినయ్ కుమార్





**బోనకల్,మే 28,(ప్రజాజ్యోతి ):** నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని నకిలీలు అంటగడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై పొదిలి వెంకన్న అన్నారు.బుధవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ రహెమాన్ పర్యవేక్షణలో మండల వ్యవసాయశాఖ అధికారి పసునూరి వినయ్కుమార్,వ్యవసాయశాఖ విస్తరణ అధికారి హరికృష్ణతో కలసి మండలంలోని విత్తనాలు ఎరువుల దుకాణాలలో,గోడౌన్లలో సంయుక్తంగా అకస్మిక తనిఖీలు చేపట్టారు.దుకాణాల్లో ఉన్న విత్తనాల స్టాక్ వివరాలను,ఎరువులు,పురుగు మందులను పరిశీలించారు.అదేవిధంగా విత్తనాలకు సంబంధించిన బిల్లు పుస్తకాలు,డెలివరి చలాన్లను,మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, విత్తనాల విక్రయ రిజిస్టర్, లాట్ రిజిస్టర్, రైతు విక్రయ రిజిస్టర్, లైసెన్స్ సక్రమంగా ఉన్నాయ లేదా అని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్సై వెంకన్న మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం,నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు.రైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటిస్తూ కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు.డీలర్లు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు విక్రయిచవద్దని, రైతులకు నష్టం కలిగేలా వ్యవహారించవద్దని అన్నారు. మార్కెట్ లో నకిలీ విత్తనాల విక్రయం జరుగకుండా టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు.నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి గాని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# మన ఊరి పిల్లల్ని మన ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం

- టీఎస్ యుటిఎఫ్ పిలుపు



**నేలకొండపల్లి, మే 28 ప్రజా జ్యోతి:** మన గ్రామంలోని బడి ఈడు పిల్లలందరినీ మన ఊరి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ బడిని కాపాడుకుందామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) అధ్యక్షులు ఎస్.కె రంజాన్ విద్యార్థుల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరుతూ టీఎస్ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జీవుజాత బుధవారం నేలకొండపల్లి మండలానికి చేరుకుంది. మండలంలోని మండలంలోని రాజేశ్వరపురం, నేలకొండపల్లి, గువ్వలగూడెం, తదితర గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేశారు .ఈ సందర్భంగా ఎస్.కె రంజాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందన్నారు. ఉచితంగా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రుచికరమైన మధ్యాహ్నం భోజనం, అన్ని రకాల సౌకర్యాలు, ఆట స్థలాలు, విశాలమైన తరగతి గదులు, మంచి లైబ్రరీ , ఐఎఫ్ పి లతోటి డిజిటల్ విద్యా బోధన మంచి వాతావరణంలో ఒత్తిడి లేని చదువులతో ప్రభుత్వ పాఠశాలలో విద్య అందుతుందని తెలిపారు. ప్రజలందరూ కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలో వేలాది మంది పిల్లల్లో కొద్దిమందిని మాత్రమే చూపించి వాళ్ళ దగ్గరే నాణ్యమైన విద్య అందుతుందని అబద్ధపు ప్రచారం చేస్తూ తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయ లు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల మీద ఆర్థిక భారాన్ని మోపుతున్నారన్నారు. దీనివల్ల కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నమవుతన్నాయన్నారు. పిల్లల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ బడులలో చేర్పించి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ జాతాలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సురేష్, నరసయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అరవింద్ కుమార్, నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి తోర్తి గురవయ్య, ముదిగొండ అధ్యక్షులు వాసం రాంబాబు, తిరుమలయాపాలెం అధ్యక్షులు కేస్యా తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక నేత కుటుంబానికి ఉపాధ్యాయ సంఘం అండ!



**వేంసూరు మే28 (ప్రజా జ్యోతి)** కార్మిక నేత, సీనియర్ జర్నలిస్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ కుటుంబానికి టి.ఎస్. యూ.టి.ఎఫ్. ఉపాధ్యాయ సంఘం అండగా ఉంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు అన్నారు.మల్లూరు సతీమణి వెంకటేశ్వరి కు సర్జరీ జరిగిన విషయం తెలుసుకున్న పారుపల్లి బుధవారం మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో నివాస గృహంలో ఆమె ను పరామర్శించి, మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షులు గుత్తా చంద్రశేఖర్,జిల్లా కార్యదర్శులు డి.నాగేశ్వరరావు,విజయ్ కుమార్,మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి లు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు గొప్ప వరం

- కాంగ్రెస్ నాయకులు తంబూరి దయాకర్ రెడ్డి



**బోనకల్,మే 28,(ప్రజాజ్యోతి):** అనారోగ్యంతో బాధపడుతు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న మండల పరిధిలోని గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన మరీదు లక్ష్మి కి ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును బుధవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు తంబూరి దయాకర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం లాంటిదని అన్నారు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఎంపీకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఏసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, మండల కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు, మురళి ఉన్నారు.

# మానవత్వం చాటుకున్న మేళ్లచెరువు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఖమ్మం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవ్యాలయం చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వర రావు తన మానవత్వాన్ని మరోసారి ప్రదర్శించారు. కల్లూరు పట్టణం మధిర రోడ్డుకు చెందిన 62 ఏళ్ల కంచర్ల పుల్లారావు ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, వెరికోస్ వేయిన్స్ శస్త్రచికిత్స కూడా చేయించుకొని తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలుసుకున్న మేళ్లచెర్వు వెంకటేశ్వర రావు, మానవతా దృక్పథంతో అతనికి ఆర్థిక సాయం అందించారు.ఈ ఘటనపై పలువురు స్థానికులు మేళ్లచెర్వు వెంకటేశ్వర రావుకు అభినందనలు తెలియజేశారు. సమాజంలో మానవత్వానికి జీవం పోసే ఈ విధమైన చర్యలు అందరికీ ఆదర్శంగా నిలవాలి అని వారు అభిప్రాయ పడ్డారు.

# నందమూరి తారక రామారావు జన్మదిన వేడుకలు

- పార్లమెంట్ హడాహక్ కమిటీ సభ్యులు వడెం విజయ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** బుధవారం ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ లోని అన్న నందమూరి తారక రామారావు ఫోటోకి దండ వేసి కేకు స్వీట్స్ పంచి అన్న కి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ అడాహాక్ కమిటీ సభ్యులు వడ్డేం. విజయ్ మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ సినీ రంగంలో ప్రజలను మెప్పించి నెంబర్ స్థానంలో నిలిచిన అన్న ఎన్టీఆర్ అదే విధంగా రాజకీయ ప్రవేశం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అన్న నందమూరి తారకరామారావు. రెండు రూపాయలకు కిలో బియ్యం అందించి పేద ప్రజల గుండె ల్లో, మనసుల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయిన అన్న ఎన్టీ రామారావు కి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందం దాయకంగా ఉం దని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు గుండె పిన్ని నాగేశ్వరావు, సౌలం లావణ్య, గుడిపూడి నాగేశ్వరరావు, నల్లమల శ్రీనివాస్, మంకెన శీను, కృష్ణమాచారి ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## శోభారాణికి నివాళులర్పించిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

- జర్నలిస్ట్ శ్రీనివాసరావును పరామర్శించిన ఎమ్మెల్యే..






**తల్లాడ, మే 28 (ప్రజా జ్యోతి ):**ఆంధ్రప్రభ రీజనల్ మేనేజర్ దాసరి శ్రీనివాసరావు సతీమణి శోభారాణి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. హైదరాబాదులోని బంధువుల ఇంటికి వెళ్లిన శోభారాణి బైక్ పై వెళుతుండగా ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుండి కింద పడి పోవడంతో హుటా హుటీన హైదరాబాదులోని ఆసుపత్రికి తరలించారు. హాస్పటల్లో చికిత్స పొందుతూ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం తల్లాడ మండలంలోని మల్లారం గ్రామంలో శ్రీనివాస్ స్వగృహానికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జర్నలిస్టు శ్రీనివాస్ ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సమయంలోనే నిబ్బరం కలిగి ధైర్యంగా ఉండాలని, తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తంతమ చేశారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల కిషోర్ , చలిగంటి సాయి, చలిగంటి మహేందర్, పగడాల వెంకటకృష్ణ, కుప్పాల నిర్మల రాజు, దుర్గదేవర అప్పారావు, చల్లా రామాంజనేయులు, దుగ్గిదేవర కృష్ణయ్య, తోట కృష్ణయ్య, తోట సైదులు పాల్గొన్నారు.

## ప్రమాదకరమైన మలుపు.. పట్టించుకుంటే మేలు.



**వైరా ప్రతినిధి (ప్రజాజ్యోతి ):** వైరా నుండి తల్లాడకు వెళ్లే జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న స్టేజి పినపాక గ్రామములో వైరా మండల గ్రామాలైన సిరిపురం నారపనేనిపల్లి ఉప్పలమడక దాచాపురం వరకు వెళ్ళు మార్గముగా, తల్లాడ మండల పరిధిలోని పాత పినపాక వెంకటాపురం ముద్దనూరు కుర్నవల్లి మిట్టపల్లి గ్రామాలకు అనుసంధానంగా ఉన్న అంతర్గత రహదారి మలుపు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది ఈ మలుపు దారిలో రోజు నిత్యం వందల మంది మండల కేంద్రానికి జిల్లా కేంద్రాలకు తమ తమ అవసరాలు నిమిత్తం ప్రయాణాలు సాగిస్తుంటారు ఇదే మలుపులో గతంలో సిరిపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొంకా వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనం లారీ ఢీ కొని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో పాటు అనేకమంది వేరు వేరు ప్రమాదాలలో తీవ్రంగా గాయాల బారిన పడ్డారు. ఇదేమలుపు ప్రాంతంలో స్టేజీ పినపాక చెందిన బస్ స్టాప్ ప్రాంగణం ఉండటం కూడా ప్రమాదాలకు ఒక కారణంగా ఉంటుంది కాబట్టి వాహన చోదకులు ఈ మలుపు ప్రాంతంలో రోడ్డును దాటుతున్నప్పుడు ఏమాత్రం ఏమరపాటుకు గురైనా ప్రమాదాలు నిత్యకృతంగా జరుగుతున్నాయి. కాబట్టి ప్రధాన రహదారికి ఇరువైపులా వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం ద్వారా మరియు హెచ్చరిక బోర్డులు పెంచడం ద్వారా ప్రమాదాలును ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని స్థానిక ప్రజలు వాహన చోదకులు సంబంధిత శాఖా అధికారులును కోరుతున్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

- 35 ఏళ్ల తర్వాత మళ్లీ కలసిన తరం.



**ఖమ్మం మే28 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**ఖమ్మంలోని విద్యా సంస్థ మారుతి ట్యుటోరియల్స్ కు చెందిన 1990-91 బ్యాచ్ 10వ తరగతి అపూర్వ విద్యార్థులు ఓ అపూర్వమైన సంభ్రమోత్సాహ సమావేశాన్ని బుధవారం జరిపారు. బడ్జెట్ హోటల్, ఖమ్మం వేదికగా జరిగిన ఈ సమావేశం పాత జ్ఞాపకాలను తిరిగి తీసుకురావడమే కాకుండా, గురువుల ఆశయాలను స్మరించుకునే సాహిత్య వేదిక గా మారింది.ఈ ప్రత్యేక వేడుకకు ఆభిమానాలతో పాల్గొన్న ఉపాధ్యాయులు యోగానందం, మధార్, జైరాం, పట్టాభిరామారావు, అమరం, ఖాదర్, లింగయ్య, శ్రీనివాస్ లను విద్యార్థులు పూల మాలలతో ఘనంగా సత్కరించి, సన్మానించారు. అనంతరం ఈ కలయికను ఉద్దేశించి ఉపాధ్యాయుల మాట్లాడుతూ, 35 ఏళ్ల తర్వాత మిమ్మల్ని ఇలా చూసిన మా హృదయం గర్వంతో నిండిపోయింది. మీరు ప్రతి ఒక్కరూ జీవితంలో ఏ స్థితిలో ఉన్నా, మీరు మా విద్యార్థులే. ఇది ఓ తల్లి తన పిల్లలను చూసిన ఆనందంతో సమానం అంటూ భావోద్వేగంతో ప్రసంగించారు. ఈ కార్యక్రమం వల్ల మేమంతా మళ్లీ కలవగలిగాము,మన గురువుల ముఖాన్ని మళ్లీ ప్రత్యక్షంగా చూసిన ఆనందం మాటల్లో చెప్పలేం అనే సంభాషణలు విద్యార్థుల మధ్య కొనసాగాయి. ఈ కార్యక్రమాన్నిసురేష్, సిద్దార్థ్, సునీత, అనిత, అరుణలు విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర వహించారు. వారంతా ఒకే మాటలో, గురువుల ఆశీర్వాదం, మిత్రుల సహకారం లేకుండా ఇది సాధ్యపడేది కాదు అన్నారు. విన్నూత్నమైన స్వాగత కార్యక్రమాలు ఈ సమ్మేళనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం ఆధ్యాంతం ఆప్యాయత, గౌరవం, గర్వం తో నిండి ఉండటంతో, ఇది ఒక మధుర జ్ఞాపకంగా మారింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఇలాగే మళ్లీ, మళ్లీ కలుసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అందరం కలిసి సహపంక్తి భోజనం చేసి, ఆటపాటలో సంతోషాలతో ముగించారు.

## లాభసాటి వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ కు పటిష్ట కార్యాచరణ అమలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- లబ్దిదారులకు వ్యాపార నైపుణ్యాలపై సంపూర్ణ శిక్షణ
- జూన్ 2 నాడు యువ వికాసం లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ
- రాజీవ్ యువ వికాసం అమలుపై డిప్యూటీ సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక రాజీవ్ యువ వికాసం పథకం క్రింద లాభసాటి వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.బుధవారం రాజీవ్ యువ వికాసం అమలు పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు హైదరాబాద్ లోని సచివాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు.రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, లాభదాయకమైన స్వయం ఉపాధి యూనిట్ ఎంపిక, నైపుణ్య శిక్షణ అందించడం, యూనిట్ గ్రౌండింగ్ తర్వాత పర్యవేక్షణ వంటి పలు అంశాల గురించి డిప్యూటీ సీఎం చర్చించి పలు సూచనలు జారీ చేశారు.యువ వికాసం పథకం క్రింద వచ్చే సహాయంతో యువత వ్యాపారం చేసి లబ్ది పొందాలని, యువతను వ్యాపార వేత్తలుగా మార్చేలా ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పెట్టుబడి ఎలా పనిచేస్తుందో రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జూన్ 2న ఎంపిక చేసిన లబ్దిదారులకు రాజీవ్ యువ వికాసం ఉపాధి యూనిట్ మంజూరి పత్రాలను అందజేయాలని అన్నారు.జూన్ 2 నాడు మంజూరు చేసే లబ్ధిదారులలో అన్ని వర్గాలకు చెందిన వారు ఉండేలా చూడాలని, జూన్ నుంచి ప్రతి నెలా యువ వికాసం యూనిట్ గ్రౌండింగ్ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారీగా లబ్ధిదారులకు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి కార్యాచరణ రూపొందించాలని అన్నారు.ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, మైనార్టీ సంక్షేమ అధికారి పురందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జీళ్ళచెరువు నిరుపేద విద్యార్థులకు అర్థిక చేయూత

- నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.40వేలు వితరణ చేసిన పూర్వ విద్యార్థి రామారావు.
- విద్యార్థులను అభినందించిన కూసుమంచి తహసీల్దార్ రవికుమార్.

**పాలేరు మే 28 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం, జీళ్ళచెరువు ఉన్నత పాఠశాలలో ఇటీవలే విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన నలుగురు పేద విద్యార్థులకు జీళ్ళచెరువు గ్రామానికి చెందిన సువర్ణకంటి రామారావు అర్థిక చేయూతనందించారు. ఆ డబ్బులను కూసుమంచి తహసీల్దార్ వి.రవికుమార్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. పదోతరగతి ఫలితాల్లో 10గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు పై చదువులు కోసం సహాయం చేయాలని సీనియర్ జర్నలిస్ట్, కూసుమంచి మండల జర్నలిస్ట్ కమిటీ అధ్యక్షుడు పెండ్ర అంజయ్య సహాయం కోరగా తక్షణమే స్పందించిన ఆ స్కూల్ పూర్వ విద్యార్థి, అమెరికాలో జాబ్ చేస్తున్న సువర్ణకంటి రామారావు వారి తండ్రి సువర్ణకంటి శంకర్ జ్ఞాపకార్థంగా విద్యార్థులకు ప్రతి ఒక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.40వేలు అర్థిక సహాయం అందించారు. కాగా బుధవారం కూసుమంచి రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ వి.రవి కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ విద్యార్థులతో మాట్లాడారు. వారి లక్ష్యం గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ ఎలా ఉండాలి, ఎలా చదువుకోవాలనే విషయంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కూసుమంచి తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులను గుర్తించి వారి పై చదువుల కోసం అర్థిక చేయూతను అందించడం గోప్ప విషయమని, గొప్ప మనుషు ఉండాలని అన్నారు. విద్యార్థులకు సాయం అందించిన రామారావును, వారి చేత సహాయం అందించేందుకు ప్రయత్నం చేసినా పెండ్ర అంజయ్యలను అభినందించారు. పెండ్ర అంజయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి ఒక్క విద్యార్థికి సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎంతో మంది ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, పూర్వ విద్యార్థులు పెండ్ర అంజయ్య, కొండా శ్రీనివాస్ రావు, సువర్ణకంటి లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయుడు తుమ్మా శ్రీనివాస్, ఉపాధ్యాయులు కారుమంచి కృష్ణయ్య, పాగోలు సన్నిరాజా, తల్లిదండ్రులు మల్సూరు, రమేష్, వెంకన్న,వీరబాబు, అలీ తదితరులు పాల్గొన్నారు.



# సాయి రేఖ హాస్పటల్ కీ అరుదైన గౌరవం.

- మంత్రి సీతక్క చేతుల మీదుగా విస్సా హెల్త్ ఎక్స్ అవార్డు పొందిన సాయి రేఖ హాస్పిటల్
- ఉత్తమ గ్రామీణ వైద్యశాల సేవ విభాగంలో అవార్డు పొందిన సాయి రేఖ హాస్పిటల్ డాక్టర్. బి. మల్సూర్ ఎంబీబీఎస్ ఎండి ( జనరల్ మెడిసిన్ )
- OP ఫీజు లేకుండా వైద్య సేవలు




**పాలేరు మే 28 ప్రజా జ్యోతి** ప్రజలకు సేవ చేయడంలో ముందుండే డాక్టర్. బి మల్సూర్ చెందిన స్వంత ఆసుపత్రికి అరుదైన గుర్తింపు లభించింది. ఆసుపత్రి పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తుండటంతో ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా అవార్డును పొందారు. వారి నుంచి ప్రశంసలు అందుకున్నారు. పూర్తి వివరాల్లోకి తెలుగు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించిన కేటగిరిలో కూసుమంచి మండల కేంద్రంలో సాయి రేఖ ఆసుపత్రికి విస్సా హెల్త్ ఎక్స్ అవార్డ్ 2025 అందించింది. సాయి రేఖ ఆస్పత్రి డాక్టర్ బి. మల్సూర్ ఆ అవార్డును అందుకున్నారు. పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమం శాఖల మంత్రి సీతక్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా విస్సా హెల్త్ ఎక్స్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో గ్రామీణ పేద ప్రజలకు తక్కువ ఖర్చులో మెరుగైన వైద్య సేవలు అందించినందుకు ఈ అవార్డు అందించినట్లు డాక్టర్ బి మల్సూర్ వెల్లడించారు. అత్యంత విశ్వసనీయమైన ప్రతిష్టాత్మకమైన హెల్త్‌కేర్ ఎక్స్ అవార్డును వివిధ విభాగాల్లో హైదరాబాద్ జేఆర్సి కన్వెన్షన్ హాల్లో అందించినట్లు వెల్లడించారు. అవార్డు గెలుచుకున్న సాయి రేఖ ఆసుపత్రి మరింత విశ్వాసం ప్రామాణికతను అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. లోతైన పరిశోధన, సర్వే ప్రక్రియ నాణ్యత, అనుభవం, అర్హతలు, కస్టమర్ అభిప్రాయం మొదలైన పరిమితులపై వివిధ విభాగాల్లో విజేతలను ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నామినేషన్లలో తమ ఆసుపత్రి ఈ అవార్డు దక్కించుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.సాయి రేఖ ఆసుపత్రికి అవార్డు రావడంతో ఆ ఆసుపత్రి బాధ్యులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

## సర్కారు బడిని కాపాడుకుందాం

- పిల్లలను సర్కారు బడులలో చేర్పిద్దాం
- టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పిలుపు
- నమోదు కొరకు ప్రచార జాతా ప్రారంభం.



**సత్తుపల్లి మే28(ప్రజా జ్యోతి)**తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం నాడు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కొరకు టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ప్రచార జాతాను స్థానిక టి ఎస్ యు టి ఎఫ్ ప్రాంతీయ కార్యాలయం రోడ్ నందు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యా యులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు , ఆటస్థలం ఉన్నాయని తల్లిదండ్రు లందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉన్నదని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, ఏకరూప దుస్తులు ఉచితంగా అందించబడు తున్నాయని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడు సార్లు కోడిగుడ్లు, రాగిజావ అందిస్తున్నారని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి పిల్లలను చేర్పించి, ఫీజుల భారం లేని ఉచిత విద్య పొందాలని, విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలలు దోహదప డుతాయని తెలియజేశారు. గుడి, మసీదు,చర్చిల నిర్మాణం కోసం ఐకమత్యంగా కదిలే ప్రజలు ఊరి బడి కోసం కూడా ఏకమై బడిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని,టీఎస్ యుటిఎఫ్ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తాయని తెలియజేశారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, అత్యున్నత విద్యార్హతలు కలిగిన టీచర్లు ఉంటారని తల్లిదండ్రులకు వివరిస్తామని తెలియజేశారు. తల్లిదండ్రుల ఆశను ప్రైవేటు విద్యా వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని,చదువుల నాణ్యతలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయని, సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ బడి మూతపడితే సమాజానికి నష్టం అని, మన ఊరు – మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మౌళిక వసతుల కల్పన మెరుగైందని తెలియ జేశారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, లేబరేటరీలతో పాటు ఆటపాటలతో అహ్లాదకరమైన వాతావరణంలో, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధతో, నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందించబడుతుందని, పిల్లల మానసిక ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి అనువుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని, మన పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పించి బడికి అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్పనిసరిగా బడి నిలబడుతుందని తెలియజేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుంది. తల్లిదండ్రులకు ఫీజుల భారం తగ్గుతుంది. కనుక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని పిలుపునిచ్చారు, మండలం లో ప్రధాన కూడళ్లలో ఎన్టీఆర్ నగర్, అంబేద్కర్ సెంటర్ ,కిష్టారం గ్రామాలలోప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార జాతాలో జిల్లా కార్యదర్సులు డి నాగేశ్వరరావు, కె విజయ్ కుమార్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, కొక్కెరగడ్డ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు,కార్యదర్శులు సూరయ్య,రవీంద్రనాథ్,మధుసూదన్ రావు, వెంకటేష్ , శేషుకుమార్, పి నరసింహారావు , కళ్యాణ్, ఎం నరసింహ రావు,చక్రపాణి, మరియు సి ఐ టి యు టౌన్ సెక్రటరీ విశ్వేశ్వర రావు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపారు. అనంతరం రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయా నంద్ విజయకుమార్ సంఘీభావం తెలియజేశారు.కృతజ్ఞతలతో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, కె వెంకటేశ్వరరావు టిఎస్ యుటిఎఫ్ సత్తుపల్లి మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు



**బోనకల్, మే 28,(ప్రజాజ్యోతి):** నటసార్వభౌమ, తెలుగుజాతి గర్వించదగ్గ నాయకుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులు మరీదు బరకయ్య జండా ఆవిష్కరణ చేయగా, సీనియర్ నాయకులు పాటిబండ్ల సుబ్బారావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ 1923 సంవత్సరంలో నిమ్మకూరులో జన్మించిన ఎన్టీఆర్, ఆరు కోట్ల మంది ఆంధ్రుల అందగాడిగా, సినీ ప్రపంచంలో తిరుగులేని రారాజుగా వెలుగొంది, తదనంతరం 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, 9 నెలల కాలంలో అధికారంలోకి వచ్చి కూడు గూడు గుడ్డ నినాదంతో పరిపాలన కొనసాగించారని, అన్ని వర్గాలకు రాజకీయ ప్రవేశం కల్పించడంతోపాటు, రెండు రూపాయల కిలో బియ్యం, జనతా వస్త్రాలు, మహిళలలకు ఆస్తిలో సమాన హక్కు, రైతులకు 50 హార్స్ పవర్ ఉచిత విద్యుత్తు, పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు, లాంటి సంస్కరణలతో పరిపాలన కొనసాగించి తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. ప్రపంచం నలుమూలల తెలుగువారి ఖ్యాతిని విస్తరింప చేశారని, తెలుగుజాతి ఉన్నంతవరకు తెలుగు వారి గుండెల్లో ఎన్టీఆర్ నిలుస్తారని కొని ఆడారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల నాయకులు మండేపూడి గొర్కె గంగుల శ్రీనివాసరావు, సంద్ర ప్రసాద్ వట్టికుండ నవీన్,వనమా అశోక్ ఎస్ కే అఫ్రాన్, ఎస్ కే ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు, రాజీవ్ యువశక్తి అమలు విషయంలో అవకతవకలు జరిగితే ఉద్యమిస్తాం సిపిఎం




**పాలేరు మే 28 ప్రజా జ్యోతి** కూసుమంచి సి. పి.యం మండల కార్యదర్శి వర్గ సమావేశం శీలం గురుమూర్తి అధ్యతన కూసుమంచి పార్టీ కార్యాలయం లో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజాశేఖర్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పథకం ఇందిరమ్మ ఇళ్ళు సంబందించిన కమిటీలు కాంగ్రెస్ కమిటీలగా ఉన్నాయి ఇళ్ళు లేని నిరుపేదలకు ఇళ్ళు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అనర్హులకు కాంగ్రెస్ పార్టీ వాళ్ళ కు మాత్రమే ఇవ్వడాన్ని వ్యతిరేకంస్తాం నిజాయితీగా ఇవ్వకపోతే ఉధ్యంచేస్తాం అని అన్నారు. అలాగే రాజీవ్ యువశక్తి లోను విషములో మా పార్టీలో చేరిన వారికి లోన్లు ఇస్తామని ప్రలోభాలకు గురిసేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలు వెంటనే మానుకోవాలని నీతిగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు,రాజీవ్ యువశక్తి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేల. షన్మత రావు, శీలం.గురుమూర్తి, యడవల్లి.రమాణరెడ్డి, బిక్కసాని.గంగాధర్ రావు, తాళ్ళూరి. వెంకటేశ్వరరావు, వొల్లోజ్. కర్ణబాబు మూడు గన్యానాయక్ పాల్గొన్నారు

## చెడు వ్యసనాలపై జరిగే పోరాటంలో యువత కదిలి రావాలి

- ఈ నెల 30 నుంచి సాగే డివైఎఫ్ఐ యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చెయ్యండి
- డి వై ఎఫ్ఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు మధు



**నేలకొండపల్లి, మే 28 ప్రజా జ్యోతి :**గంజాయి డ్రగ్స్ మాదకద్రవ్యాలు, ఆన్లైన్ బెట్టింగ్ వంటి చెడు వ్యసనాలపై జరిగే పోరాటంలో యువత కదిలి రావాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు మధు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రావెళ్ళ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు నిర్మూలించాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ లు నిషేధించాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుండి డివైఎఫ్ఐ యువ చైతన్య సైకిల్ యాత్రను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నేడు గంజాయి డ్రగ్స్ మాదక ద్రవ్యాలు ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారిలు యువతను పట్టిపీడిస్తూ వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం, మాదిక ద్రవ్యాలు పట్టణ ప్రాంతాల నుండి నేడు గ్రామాలకు, మారుమూల పల్లెలకు కూడా విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహమ్మారి వల్ల 17 ఏళ్ల నుండి 40 ఏళ్ల వయసు వారు ఎక్కువగా యువత ఆరోగ్యాలు దెబ్బతిని చనిపోతూ కుటుంబాలను విషాదంలో ముంచుతున్నారన్నారు. ఈ ప్రమాదకర మాదక ద్రవ్యాలను బెట్టింగ్ యాప్స్ ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాలని వాటి బారిన యువత పడకుండా చైతన్యవంతం చేయడం కోసమే సైకిల్ యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా ప్రభుత్వాలు వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, నిరుద్యోగి యువకులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలనే లక్ష్యంతో యువ చైతన్య సైకిల్ యాత్ర చేపట్టి ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ యువత సమస్యలు తెలుసుకుంటూ చైతన్య వంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ సైకిల్ యాత్రలో యువత అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.